


ప్రభుత్వానికి అప్పగించే బియ్యం లెక్కలపై పర్యవేక్షణ ఏదీ? రైస్ మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయా?

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

సంపుటి - 3 సంచిక -148 బుధవారం18 నవంబర్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

- తెలుగు రాష్ట్రాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు.. భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలుల ముప్పు
- ఈ నెలలోనే మూడో తుపాన్ ముప్పు.. 19 నాటికి తీవ్ర తుపాన్‌గా అక్వాన్



ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

- అంతర్జాతీయ చట్టాల గౌరవానికి దేశాల పిలుపు..
సముద్ర భద్రత, వాణిజ్యం, ఆర్థిక సహకారంపై సంయుక్త ప్రకటన



గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

● నామినేషన్ల సమయంలో ఆటంకాలు లేకుండా చూడాలి.. భద్రత కోరుతూ వచ్చిన వినతులపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశం





పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

- చేయూత పింఛన్లతో వృద్ధులు, నిరుపేదలకు అండ.. సత్తుపల్లిలో పంపిణీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

సత్తుపల్లి నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. పెద్దలకు అండగా, పేదలకు తోడుగా చేయూత పింఛన్లు మంజూరు చేస్తున్నామని, సన్నబియ్యం పథకంతో పేదల ఆకలి తీరుస్తున్నామని తెలిపారు. మంగళవారం సత్తుపల్లిలోని లక్ష్మీప్రసన్న ఫంక్షన్ హాల్‌లో మిగతా2లో...

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!


- బ్యారేజీకి ఎన్ఓసీ ఇవ్వాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి..
త్వరలో ప్రక్రియ పూర్తి చేస్తామని ఛత్తీస్‌గఢ్ సీఎం హామీ



హైదరాబాద్,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);: ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీ జారీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి మంగళవారం రాయ్‌పూర్‌లో ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం, నీటి నిల్వ సామర్థ్యం, తెలంగాణకు కలిగే ప్రయోజనాలను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయి ఎన్ఓసీ ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.బ్యారేజీ పూర్తి స్థాయి నీటిమట్టం 83 మీటర్లు కాగా, 6.94 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు గోదావరి జలాలను వినియోగించుకోవడమే ప్రాజెక్టు లక్ష్యమని వివరించారు. భూసేకరణ, పరిహారం, పునరావాసానికి మిగతా2లో...

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

- కాంగ్రెస్ నేతలపై కేటీఆర్ విమర్శలు..
మూడేండ్ల పాలనలో సాధించింది శూన్యమని వ్యాఖ్య



హైదరాబాద్(నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త); సోనియా గాంధీ గుండెల్లో తెలంగాణ ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నప్పుడు, ఆమె రాసిన ఆత్మకథ 'బిలాంగింగ్'లో తెలంగాణ ప్రస్తావన ఎందుకు లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీనే అని చెప్పుకునే కాంగ్రెస్ నేతలు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రం ఎవరి దయాభిక్ష కాదని, ప్రజల పోరాటం, కేసీఆర్ నాయకత్వంలో సాగిన ఉద్యమ ఫలితమని పేర్కొన్నారు.మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. కాంగ్రెస్ ప్రభుత్వం మూడేండ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే ప్రభుత్వ సాధనగా అభివర్ణించారు.రాష్ట్రానికి మిగతా2లో...

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు..
19న సిద్దిపేట సభలో దరఖాస్తు విడుదల





పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

- అధికారుల మధ్య ఏకాభిప్రాయం..
పదోన్నతుల ప్రక్రియ వేగవంతం

హైదరాబాద్,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);పోలీసు అధికారుల పదోన్నతులకు సంబంధించి ఏళ్ల తరబడి కొనసాగుతున్న వివాదాల పరిష్కారానికి కీలక ముందడుగు పడింది. సీనియారిటీ, రిజర్వేషన్ ఆఫ్ రోస్టర్ (ఆర్ఓఆర్), ఖాళీలు, అర్హతలపై ఉన్న అభ్యంతరాలను పరస్పర అంగీకారంతో పరిష్కరించేందుకు నిర్ణయించారు.

మిగతా2లో...

రైతుల కష్టాలు పట్టవా?

- ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రైతులకు తప్పని ఇక్కట్లు
- కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చి నెల రోజులైనా కొనుగోళ్లు లేవు..
వేగవంతం చేయాలని హరీశ్‌రావు డిమాండ్



కల్వకుర్తి,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త); ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా కొనుగోళ్లు చేపట్టకపోవడంతో రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. మిగతా2లో...

అమరావతి ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

ప్రపంచ సవాళ్లపై ఉమ్మడి పోరు!

మనీలా,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);
ప్రపంచవ్యాప్తంగా మారుతున్న పరిణామాలు, పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో కలిసి ముందుకు సాగాలని తూర్పు ఆసియా దేశాలు సంకల్పించాయి. మనీలాలో మంగళవారం ముగిసిన తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సు అనంతరం 'స్థిరమైన భవిష్యత్తు, పునరుద్ధరణ కోసం కలిసి ముందుకు' అనే శీర్షికతో సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. సముద్ర భద్రత, వాణిజ్య ఆంక్షలు, పెరుగుతున్న ధరలు, సరఫరా వ్యవస్థల బలోపేతం వంటి కీలక అంశాలకు ఇందులో ప్రాధాన్యం ఇచ్చాయి.ఆసియాన్ దేశాలతో పాటు భారత్, అమెరికా, చైనా, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, రష్యా తదితర దేశాలు ఈ సమావేశంలో పాల్గొన్నాయి. 1982లో కుదిరిన ఐక్యరాజ్యసమితి సముద్ర చట్టాల ఒప్పందాన్ని గౌరవించాలని నేతలు స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా సముద్ర వాణిజ్యం, నౌకాయానం, గగనతల ప్రయాణ స్వేచ్ఛను పరిరక్షించాలని పిలుపునిచ్చారు.సముద్ర వనరులు, జీవవైవిధ్యం, పర్యావరణ వ్యవస్థల సంరక్షణతో పాటు సముద్ర కాలుష్యం, వ్యర్థాల నివారణకు పరస్పర సహకారం పెంచుకోవాలని పేర్కొన్నారు. సముద్రగర్భంలోని కేబుళ్లు, పైప్‌లైన్లు, కీలక మౌలిక



సదుపాయాలకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు. వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. **ధరల నియంత్రణకు వాణిజ్య మార్గాలు** నిత్యావసర వస్తువులు, ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సరఫరాలో కొరత ఏర్పడకుండా వాణిజ్య మార్గాలను తెరిచి ఉంచాలని దేశాలు నిర్ణయించాయి. కీలక ఖనిజాలతో సహా సరఫరా వ్యవస్థలు అంతరాయాలను తట్టుకునేలా అభివృద్ధి చేయాలని పేర్కొన్నాయి. వాణిజ్య సమస్యలను చర్చలు, సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించాయి. వాయు, భూ, సముద్ర మార్గాల్లో అనుసంధానాన్ని విస్తరించడంతో పాటు ఇంధన రంగంలో సహకారాన్ని పెంచుకోవాలని పిలుపునిచ్చాయి.డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు, శాస్త్రసాంకేతిక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల్లో పరస్పర సహకారాన్ని విస్తరించాలని నిర్ణయించాయి. ఆన్‌లైన్ మోసాలు, మనుషుల అక్రమ రవాణా, ఇంటర్నెట్ ద్వారా జరిగే లైంగిక వేధింపులు, దోపిడీ వంటి నేరాలను అరికట్టేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని పేర్కొన్నాయి. ముఖ్యంగా పిల్లలు, బలహీన వర్గాల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశాయి.ఇంధన, ఆహార భద్రత, ఆరోగ్య వ్యవస్థల స్థిరత్వం, విపత్తుల సన్నద్ధత, సహాయక చర్యలు, వలస కార్మికుల రక్షణ వంటి అంశాల్లోనూ సహకారాన్ని బలోపేతం చేయాలని నేతలు నిర్ణయించారు. **శాంతియుత ఇండో-పసిఫిక్ లక్ష్యం: మోదీ** శాంతియుతమైన, సుస్థిరమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతం భారత్ ఆకాంక్ష అని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. తూర్పు ఆసియా శిఖరాగ్ర సదస్సులో ప్రసంగిస్తూ ప్రాంతీయ, అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారంలో చర్చలు, దౌత్యానికి ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. ఆసియా-పసిఫిక్ ప్రాంత భద్రత, రక్షణ అంశాలపై చర్చించేందుకు ఈ సదస్సు కీలక వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రాంతీయ సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

సమ్మక్క సాగర్ అనుమతులకు సానుకూల సంకేతం!

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని, మిగిలిన అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.**నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు స్థిరీకరణ** సమ్మక్క సాగర్ బ్యారేజీ ద్వారా ఎస్సారెస్పీ రెండో దశ కింద నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. రామప్పపాకాల లింక్ కెనాల్ ద్వారా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రణాళిక రూపొందించింది. బ్యారేజీకి అనుమతులు లభిస్తే ఈ ప్రాంతాల సాగు, తాగునీటి అవసరాలకు ప్రయోజనం చేకూరనుంది. **ముంపు తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతం మార్పు** సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే అక్కడ 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉండటంతో పాటు 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తించారు. దీంతో ముంపును తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం పూర్తి స్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదని అంచనా వేశారు. ఈ అధ్యయన నివేదికను ఐఐటీ ఖరగ్‌పూర్ జులై 30న ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం కోరిన రూ.9.88 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లోనే చెల్లించింది. సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసీపై ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో అనుమతుల ప్రక్రియ ముందుకు సాగుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

కోటి కుటుంబాలకు బీమా భరోసా!

హైదరాబాద్,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);
రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు ఇందిరమ్మ బీమా పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని సూచించారు. ఈ పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలతో పాటు లక్షలాది మంది పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించనున్నట్టు తెలిపారు.ఇప్పటికే అమలులో ఉన్న వివిధ బీమా పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందిస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభించడంతో పాటు దరఖాస్తులను విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ బీమా పథకాల ద్వారా ప్రయోజనం పొందుతున్న వారిలో ఏ ఒక్కరూ కొత్త పథకం అమలుతో నష్టపోకూడదని అధికారులకు స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి కుటుంబానికి బీమా ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు పథకంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.**మహిళలందరికీ ఇందిరమ్మ చీరలు** అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.
చీరలను తక్షణమే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ఇందిరమ్మ బీమా, చీరల పంపిణీపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.
ఈ సమీక్షలో సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కార్యదర్శి మానిక్‌రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యం

(మొదటి పేజీ తరువాయి)

ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అధ్యక్షతన నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. తొలి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షలు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 8 లక్షల ఇళ్లను రూ.40 వేల కోట్ల వ్యయంతో మంజూరు చేసినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పారదర్శకంగా 72 వేలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేశామని, ప్రశ్నాపత్రాల లీకేజీలకు తావులేకుండా గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు నియామకాలు చేపట్టామని చెప్పారు. గత పదేళ్లుగా నిలిచిపోయిన ఆసరా పింఛన్లను దీపావళి నాటికి అర్హులైన మహిళలు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కులవృత్తుల వారికి కొత్తగా మంజూరు చేశామని తెలిపారు. ప్రతిపక్షాల ప్రచారాలను నమ్మకుండా అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.**మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం** కోటి మంది డ్వాక్రా మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో గత 33 నెలల్లో రూ.73 వేల కోట్ల సున్నా వడ్డీ రుణాలు అందించామని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని ఇల్లు ఉండకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకర టీఎస్, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, కమిషనర్ కోండ్ర నరసింహ, ఎంపీడీవో రావెళ్ల చిన్న నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చల్లగుళ్ల నరసింహారావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గాదె చెన్నకేశవరావు, భీమిరెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టవా?

(మొదటి పేజీ తరువాయి)

నారాయణఖేడ్ పర్యటనలో భాగంగా నిజాంపేటలో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించి, వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.
ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రైతులు నెల రోజుల క్రితమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చినా ఇప్పటివరకు ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయలేదని అన్నారు.
కేంద్రాల్లో కనీస సౌకర్యాలు, తాగునీరు కూడా కల్పించకపోవడం బాధాకరమన్నారు.
సాగుకు సరిపడా విద్యుత్, నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతుంటే, పండించిన పంటను కూడా సకాలంలో కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.ప్రభుత్వం రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.
కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సిబ్బంది, బార్‌దాన్, గోనె సంచులు, రవాణా సదుపాయాలు కల్పించి కొనుగోళ్లను వెంటనే వేగవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో మరో తుపాన్ కలకలం!

న్యూఢిల్లీ,నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త); బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం బలపడుతుండటంతో మరో తుపాన్ ముప్పు పొంచి ఉంది. గడిచిన నెల రోజుల వ్యవధిలో ఇప్పటికే అర్నాబ్, మురసు తుపాన్లు రాగా, తాజాగా మూడో తుపాన్ రానుండటం ఆందోళన కలిగిస్తోంది. దీనికి 'అక్వాన్'గా నామకరణం చేశారు. సముద్రంలో మేఘాలు వేగంగా కదులుతున్న నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలుగు రాష్ట్రాలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది.ఇన్‌సాట్-3డీఎస్, ఇన్‌సాట్-3డీఆర్ ఉపగ్రహ చిత్రాల్లో ఆగ్నేయ బంగాళాఖాతం, దానికి ఆనుకుని ఉన్న నైరుతి బంగాళాఖాతంలో భారీగా మేఘాలు ఏర్పడినట్లు గుర్తించారు. అక్వాన్ తుపాన్ నవంబర్ 19 నాటికి మరింత బలపడి తీవ్ర తుపాన్‌గా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.**20న తీరం దాటే అవకాశం**ఈ నెల 20న నెల్లూరుతుని మధ్య తుపాన్ తీరం దాటే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 120 నుంచి 130 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉండగా, గరిష్ఠంగా 145 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీయవచ్చని హెచ్చరించారు. తుపాన్ ప్రభావంతో నవంబర్ 18 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ పరిస్థితులు మారనున్నాయి. పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఈదురుగాలులతో పాటు ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని అధికారులు అప్రమత్తం చేశారు. **మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు** సముద్రం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నందున మత్స్యకారులు ఎట్టి పరిస్థితుల్లోనూ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. తీరప్రాంత ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గ్రామ ఎన్నికల అభ్యర్థులకు పోలీసు రక్షణ

అమరావతి నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త);
రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులకు తగిన పోలీసు భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసేందుకు వెళ్లే సమయంలో ఎలాంటి ఆటంకాలు ఎదురుకాకుండా చూడాలని పోలీసులకు స్పష్టం చేసింది. భద్రత కోరుతూ అభ్యర్థులు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా పంపిన వినతులను పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ మండవ కిరణ్మయి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.రాష్ట్రంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు భద్రత కోరుతూ వేర్వేరుగా హైకోర్టును ఆశ్రయించారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు సిద్ధమవుతున్న తమకు రక్షణ కల్పించాలని పోలీసులకు వినతిపత్రాలు సమర్పించినా స్పందన లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాదులు వి. సాయికుమార్, సానేపల్లి రామలక్ష్మణరెడ్డి, కొమ్మారెడ్డి దివాకర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు కోర్టుకు తెలిపారు.ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడ్డారని పిటిషనర్లు ఆరోపించారు. రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లోనూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యే ప్రమాదం ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అభ్యర్థుల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

తెలంగాణపై సోనియా మౌనం ఎందుకు?

(మొదటి పేజీ తరువాయి)

లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం.. ఎన్ని పరిశ్రమలు ప్రారంభమయ్యాయి, ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐటీ ఉద్యోగాలు తగ్గుతున్నాయని, భూముల ధరలు పడిపోతున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు పెరుగుతున్న డిమాండ్ నగరంలో నీటి కొరతకు నిదర్శనమని అన్నారు.22ఏ పేరుతో భూములను బ్లాక్ చేయడం, హైడ్రా పేరుతో కూల్చివేతలు చేపట్టడం వల్ల రియల్ ఎస్టేట్ రంగం దెబ్బతింటోందని కేటీఆర్ ఆరోపించారు. పేదల ఇళ్లపై చర్యలు తీసుకుంటూ పెద్దల అక్రమ నిర్మాణాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డ్‌లా వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ నిర్వహించిన భారత్ సమ్మిట్ వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం కలగలేదని, దానికి ఖర్చు చేసిన నిధులను ప్రజల అవసరాలకు వినియోగించి ఉంటే బాగుండేదని అన్నారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినప్పటికీ రైతులకు తగిన సహాయం అందడం లేదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ప్రభుత్వం రాజకీయాలు చేయడం మానుకుని ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు.

పోలీసు పదోన్నతుల వివాదానికి పరిష్కారం

(మొదటి పేజీ తరువాయి)

డీజీపీ సీవీ ఆనంద్ చొరవతో మంగళవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో 1991, 1995, 1996 బ్యాచ్‌ల సివిల్ ఎస్సైలతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పదోన్నతుల ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలు, సీనియారిటీ వివాదాలు, రోస్టర్ పాయింట్లు, ఖాళీలపై చర్చించారు. కోర్టు కేసులు, ఇతర వివాదాల కారణంగా అర్హులైన అధికారులు పదోన్నతులు కోల్పోకుండా ఏకాభిప్రాయంతో ముందుకు వెళ్లాలని డీజీపీ సూచించారు.**తొలిదశలో 54 అదనపు ఎస్పీ పోస్టులు** డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించేందుకు తొలిదశలో 54 పోస్టులు అందుబాటులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. రెండో దశలో 2027 ఆగస్టు నాటికి మరో 34 పోస్టులు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం న్యాయపరమైన వివాదాలు లేని 12 నాన్ క్యాడర్ ఎస్పీ పోస్టులను తక్షణమే భర్తీ చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు. ప్యానల్ ఇయర్‌లో మరో 10 పోస్టులు కేటాయించనున్నట్లు వెల్లడించారు.సీనియారిటీ, సర్వీసు కాలం, రోస్టర్ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని పదోన్నతి జాబితాలను సిద్ధం చేశారు. సమావేశంలో కుదిరిన ఏకాభిప్రాయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి ప్రక్రియను వేగవంతం చేస్తానని డీజీపీ తెలిపారు. అర్హులైన అధికారులకు నిబంధనల ప్రకారం న్యాయం చేస్తామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ మహేశ్ ఎం. భగవత్, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, ఇతర సీనియర్ పోలీసు అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ వేళ ఉద్యోగులకు సెలవు

● 23 పట్టణ స్థానిక సంస్థల్లో నవంబర్ 26న స్థానిక సెలవు..
గ్రామ పంచాయతీ ఎన్నికల రోజుల్లోనూ వెసులుబాటు

అమరావతి, నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త); ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో ఈ నెల 26న స్థానిక సెలవు ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు నగరపాలక సంస్థలు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలకు ఈ సెలవు వర్తించనుంది.ఆయా ప్రాంతాల్లోని ప్రైవేటు సంస్థలు, కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు సెలవు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.మరోవైపు గ్రామ పంచాయతీలకు సాధారణ ఎన్నికల పోలింగ్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో మూడు విడతలుగా జరగనుంది. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ రోజున నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం1881 ప్రకారం స్థానిక సెలవు ప్రకటించే అధికారాన్ని జిల్లా కలెక్టర్లకు ప్రభుత్వం కల్పించింది. సెలవు ప్రకటించడం సాధ్యం కాని చోట్ల ఉద్యోగులు ఓటు వేసేందుకు తగిన సమయం కేటాయించాలని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల యాజమాన్యాలకు స్పష్టం చేసింది.

తక్కువ ఖర్చుతో పోషకాహార తయారీపై అవగాహన

కూరగాయల కిచిడీ తయారీపై ప్రదర్శన





నర్సంపేట/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

నర్సంపేట-4 అంగన్‌వాడీ కేంద్రంలో తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలు కలిగిన ఆహార తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ అరుణ్ జ్యోతి ఆధ్వర్యంలో వివిధ కూరగాయలతో కిచిడీ తయారీని ప్రదర్శించారు. సీడీపీఓ మధురిమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి స్థానిక కౌన్సిలర్, ఏఎల్ఎంఎస్సీ కమిటీ చైర్మన్ శ్రీరామోజు రోజారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ అరుణ్ జ్యోతి మాట్లాడుతూ కూరగాయలతో తయారుచేసిన కిచిడీ ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు, విటమిన్లు లభిస్తాయని తెలిపారు. తక్కువ సమయంలోనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని సిద్ధం చేసుకోవచ్చన్నారు. అనంతరం మహిళలకు వంటకాల తయారీపై అవగాహన కల్పించి భోజనం ఏర్పాటు చేశారు.రోజారాణి మాట్లాడుతూ గృహిణి ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పోషకాహారంపై అవగాహనను విస్తృతంగా కల్పించాలని సూచించారు.సీడీపీఓ మధురిమ మాట్లాడుతూ బయట ఆహార పదార్థాలపై ఆధారపడకుండా ఇంట్లోనే పౌష్టికాహారం తయారుచేసుకోవాలని సూచించారు. పెరటి తోటల్లో కూరగాయలు సాగుచేసి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలన్నారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేష్ మాట్లాడుతూ చేపల వినియోగంతో కాల్షియం, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు లభిస్తాయని వివరించారు. ఖేత్ బచావో కార్యక్రమంలో భాగంగా సాగుభూమి సంరక్షణపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏసీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్ అరుణ, ప్రధానోపాధ్యాయురాలు శోభ, అంగన్‌వాడీ టీచర్ నల్ల భారతి, ఆయా సునీత, ఏఎన్ఎం కవిత, అంగన్‌వాడీ టీచర్లు రాధ, శిరీష, గౌసియా, కమిటీ సభ్యులు, ఆశా కార్యకర్తలు, పలువురు తల్లులు పాల్గొన్నారు.

రైతుల ధాన్యం కొనుగోళ్లలో జాప్యానికి తావుండొద్దు!

పెద్దపెండ్యాలలో పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు ఇబ్బందులు కలిగిస్తే సహించేది లేదు.. అధికారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టమైన ఆదేశాలు





ధర్మసాగర్/వరంగల్ ఉమ్మడి జిల్లా బ్యూరోనవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు ధాన్యం కొనుగోళ్లను ఎలాంటి జాప్యం లేకుండా వేగవంతం చేయాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే, తెలంగాణ మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అధికారులకు స్పష్టం చేశారు. రైతులను కొనుగోలు కేంద్రాల చుట్టూ తిప్పించకుండా, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ధర్మసాగర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో పెద్దపెండ్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని, కేంద్రంలో అవసరమైన సౌకర్యాలన్నీ అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో నిర్లక్ష్యం, జాప్యం లేకుండా అధికారులు, సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.


రైతులకు మద్దతుగా కొనుగోలు కేంద్రాలు పనిచేయాలని, ధాన్యం విక్రయించే సమయంలో అన్నదాతలు అనవసర ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా సహకార అధికారి భూక్య మోహన్, నోడల్ అధికారి కృష్ణవేణి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పెద్దపెండ్యాల గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, గ్రామ శాఖ అధ్యక్షులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ ధర్మసాగర్ డైరెక్టర్లు బొడ్డు లెనిన్, జంగా వీరయ్య, కార్యదర్శి పింగిలి రాజిరెడ్డి, పెద్దపెండ్యాల పీపీసీ కేంద్రం ఇన్‌చార్జి కలకోటి మురళీకృష్ణ, కార్యాలయ సిబ్బంది ఆవుల కుమారస్వామి, బొడ్డు ప్రభుదేవ్, పోలుమారి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ కొనుగోలు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ ధర్మసాగర్ నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల కొత్త పింఛన్లు మంజూరు

ఈ నెల 19న కొత్త పింఛన్ల ఖాతాల్లో నగదు జమ.. -ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘన్‌పూర్ /నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు.మంగళవారం స్టేషన్ ఘన్‌పూర్ పట్టణంలోని ఎస్ కన్వెన్షన్ హాల్లో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పింఛన్ల మంజూరు పత్రాలతోపాటు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, చేనేత కార్మికులకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తోందన్నారు. గతంలో గ్రామాల్లో పర్యటించినప్పుడు భర్తను కోల్పోయిన మహిళలు, కుటుంబ పెద్దను కోల్పోయిన నిరుపేదలు, దివ్యాంగులు పింఛన్ల కోసం తనను ఆశ్రయించేవారని గుర్తుచేశారు. అర్హత ఉన్నప్పటికీ పింఛన్లు అందక ఇబ్బందులు పడుతున్న వారి సమస్యలను పరిష్కరించలేకపోయిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు కావడం సంతోషంగా ఉందన్నారు.గతంలో కొత్త పింఛన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రజల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.63 లక్షల కొత్త చేయూత పింఛన్లను మంజూరు చేసిందని వెల్లడించారు. గతంలో పింఛన్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీల అమలుతోపాటు పేదలు, మహిళలు, రైతుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 45 లక్షల మందికి చేయూత పింఛన్లు అందుతున్నాయని, ఇందుకోసం ఏటా రూ.12 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 19న ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కొత్త పింఛన్ల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని, అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతి కుటుంబానికి ఉచితంగా ప్రమాద బీమా కల్పించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అంబటి కిషన్ రాజ్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

ఎంపీడీవోకు వినతిపత్రం అందజేసిన ఫ్యూచర్ సొసైటీ ప్రతినిధులు

జనగామ/బచ్చన్నపేట నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):



బచ్చన్నపేట మండల కేంద్రంలో 2018లో మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే, తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలకు స్థలాలు కేటాయించి, శాశ్వత భవనాలు నిర్మించాలని ఫ్యూచర్ సొసైటీ చైర్మన్ మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.2018లో ప్రభుత్వం బచ్చన్నపేట మండల కేంద్రానికి బాలికల కోసం మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను, బాలుర కోసం బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. అయితే సొంత భవనాలు లేకపోవడంతో బాలికల గురుకులాన్ని పెంబర్తి గ్రామానికి, బాలుర గురుకులాన్ని జనగామకు తరలించారు. దీంతో బచ్చన్నపేట మండలానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి విద్యనభ్యసించాల్సి వస్తోందని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.అధికారులు తక్షణమే స్పందించి బచ్చన్నపేట మండల కేంద్రంలో గురుకుల పాఠశాలలకు అనువైన స్థలాలు కేటాయించాలని, శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. స్థానిక విద్యార్థులకు అందుబాటులోనే నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ముదిగొండ శ్రీనివాస్, శిరిపాటి అరుణ్ కుమార్, మంగళంపల్లి భాస్కర్, ఆర్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

ఆరోగ్య పరిరక్షణలో దబ్బగుంటపల్లి పాఠశాల ఆదర్శం

సాయి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం: ఎంఈఓ బాలకిషన్ రావు

జనగామ/బచ్చన్నపేట నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని ఎంఈఓ పండరి బాలకిషన్ రావు అన్నారు. సోమవారం బచ్చన్నపేట మండలంలోని దబ్బగుంటపల్లి పాఠశాలలో సాయి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాహారంలో భాగంగా అరటిపండ్లను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత మూడేళ్లుగా సాయి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ విద్యార్థులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు అరటిపండ్లు, సాయంత్రం వేరుశనగ కిచిడీ అందిస్తూ వారి ఆరోగ్య పరిరక్షణకు ట్రస్ట్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు పౌష్టికాహారం అందించడం వల్ల వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంతం చంద్రకళ, సాయి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్నల్ డాక్టర్ సి. నరేందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్



నర్సంపేట/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

నర్సంపేట పట్టణ అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండెం శ్రీలక్ష్మీరామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ నర్సంపేట నియోజకవర్గ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి నాయకత్వంలో పట్టణం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని తెలిపారు. రహదారులు, మురుగునీటి కాలువలు, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు నర్సంపేట పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణ ప్రజల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ముందుకు సాగుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, సలావుద్దీన్ అయూబ్ ఖాన్, శ్రీరామోజు రోజారాణి, మున్సిపల్ సిబ్బంది బొల్లెపెల్లి శ్రావణ్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ములుకల మనీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొమ్మెరబోయిన ప్రేమ్‌కృష్ణ, మచ్చకంటి మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే యువకుడి ప్రాణం తీసింది!

ఎస్ఆర్ యూనివర్సిటీ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం.. బైక్‌ను ఢీకొట్టిన లారీ

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న హసన్‌పర్తి పోలీసులు



హసన్‌పర్తి/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్ కారణంగా జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 20 ఏళ్ల యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. మృతుడు ఎల్కతుర్తి మండలం దండేపల్లి గ్రామానికి చెందిన పనుగంటి వినయ్ రెడ్డి (20)గా హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ వెల్లడించారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వినయ్ రెడ్డి ఎల్కతుర్తిలోని ఓ పెట్రోల్ బంకులో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో తన ద్విచక్ర వాహనం (ఏ+-03-దీూ-2196)పై దండేపల్లి నుంచి విధులకు బయలుదేరాడు. ఉదయం 9.30 గంటల సమయంలో ఎస్ఆర్ యూనివర్సిటీ దాటి వెళ్తుండగా, ఎల్కతుర్తి వైపు నుంచి హనుమకొండకు వస్తున్న లారీ (యూ-05-ఖదీ-8568) డ్రైవర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వినయ్ రెడ్డి బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వినయ్ రెడ్డి వెనుక నుంచి వస్తున్న కారుపై పడిపోయాడు.

ప్రమాదంలో వినయ్ రెడ్డికి తల, కాళ్లు సహా శరీరంలోని పలు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే అతడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

మృతుడి తల్లి పనుగంటి అనూరాధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు.

అంతర్జాతీయ ప్రజల పత్రిక
RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక

మనిషిని కొలిచేది ఆస్తి అంతస్తులు కాదు.. వ్యక్తిత్వమే!

చదువు కంటే సంస్కారం మిన్న.. సంపద కంటే సంతోషం మిన్న.. కులం కంటే గుణం మిన్న.. అధికారానికి మించినది ఆత్మగౌరవం!

మనిషి గొప్పతనం అతను ఎంత ఎత్తుకు ఎదిగాడన్న దానిలో కాదు.. ఎదిగిన తర్వాత ఎంత ఒదిగి ఉన్నాడన్న దానిలో ఉంటుంది.

నేటి సమాజంలో మనిషి విలువను కొలిచే కొలమానాలు మారిపోతున్నాయి. ఎవరి దగ్గర ఎంత ఆస్తి ఉంది? ఎవరు ఎంత పెద్ద పదవిలో ఉన్నారు? ఎవరి వెనుక ఎంతమంది ఉన్నారు? అనే లెక్కలకే ప్రాధాన్యత పెరుగుతోంది. కానీ ఒక మనిషికి నిజమైన గౌరవాన్ని తెచ్చేది ఇవేవీ కావు. అతని నడవడిక, సంస్కారం, మంచితనం, ఎదుటివారిని గౌరవించే తత్వమే అసలైన వ్యక్తిత్వానికి అద్దం పడతాయి.

చదువు మనిషికి జ్ఞానాన్ని ఇస్తుంది. కానీ ఆ జ్ఞానానికి విలువను తెచ్చేది సంస్కారం. ఎన్ని పట్టాలు పొందినా ఎదుటివారిని గౌరవించలేకపోతే ఆ చదువు వల్ల ప్రయోజనం ఏమిటి? ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నా అహంకారాన్ని వీడలేకపోతే ఆ హోదాకు అర్థం ఏమిటి? ఎదుటివారి మనసును నొప్పించకుండా మాట్లాడటం, కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవడం, మనకంటే చిన్నవారిని కూడా గౌరవించడం నిజమైన సంస్కారానికి నిదర్శనం.

సంపద మనిషికి సౌకర్యాలను అందించవచ్చు. కానీ సంతోషాన్ని మాత్రం కొనివ్వలేదు. కోట్ల రూపాయల ఆస్తులున్నా మనశ్శాంతి లేని జీవితాలు ఎన్నో కనిపిస్తున్నాయి. మరోవైపు సాధారణ జీవితం గడుపుతూ కుటుంబంతో ఆనందంగా, నలుగురితో



ఆత్మీయంగా జీవించేవారూ ఉన్నారు. అందుకే సంపద కంటే సంతృప్తి గొప్పది. డబ్బుతో వస్తువులను కొనగలం కానీ ఆప్యాయతను, ఆత్మీయతను, నమ్మకాన్ని కొనలేం.

కులం మనిషి పుట్టుకను నిర్ణయించవచ్చు కానీ అతని గొప్పతనాన్ని నిర్ణయించలేదు. మతం మనిషి విశ్వాసానికి సంబంధించినది కానీ మానవత్వానికి అడ్డుగోడ కాకూడదు. కులమతాల పేరుతో మనుషుల మధ్య గోడలు కట్టడం కంటే గుణగణాల ఆధారంగా మనుషులను అంచనా వేయడం నేర్చుకోవాలి. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే చేతికి కులం ఉండదు. ఆపదలో ఆదుకునే మనసుకు మతం ఉండదు. మనిషిని మనిషిగా చూసే దృక్పథమే సమాజానికి అవసరం.

అధికారం శాశ్వతం కాదు. పదవులు వస్తుంటాయి.. పోతుంటాయి. కానీ పదవిలో ఉన్నప్పుడు మనిషి ప్రవర్తించిన తీరు, ప్రజల పట్ల చూపిన బాధ్యత, న్యాయం, నిబద్ధత మాత్రమే చిరకాలం గుర్తుండిపోతాయి. అధికారం ఉందని అహంకారంతో వ్యవహరిస్తే కొంతకాలం భయపడవచ్చు కానీ మనస్ఫూర్తిగా గౌరవించరు. ఆత్మగౌరవంతో, ఆత్మీయతతో వ్యవహరించే వ్యక్తికే సమాజంలో నిజమైన గుర్తింపు లభిస్తుంది.

అందం కన్నా మంచి మనసు గొప్పది. ఎందుకంటే శరీర సౌందర్యం కాలంతో పాటు మారిపోతుంది. కానీ మంచితనం తరతరాలకు గుర్తుండిపోతుంది. మాటలు చెప్పేవారు చాలామందే ఉంటారు. చెప్పిన మాటను చేతల్లో చూపించేవారే అరుదు. నమ్మకాన్ని నిలబెట్టుకోవడం, ఇచ్చిన మాటకు కట్టుబడటం, ఇతరుల కష్టాన్ని తన కష్టంగా భావించడం మనిషిలో ఉండాల్సిన అసలైన లక్షణాలు.

నేటి పోటీ ప్రపంచంలో ఎదగాలనే తపన తప్పు కాదు. కానీ ఎదగడం కోసం ఎదుటివారిని కించపరచడం, మోసం చేయడం, స్వార్థానికి ప్రాధాన్యత ఇవ్వడం మాత్రం సరైన మార్గం కాదు. మనం ఎదిగే క్రమంలో నలుగురికి చేయూతనివ్వాలి. మన విజయంతో మరొకరి జీవితంలో వెలుగు నింపగలిగితే అంతకంటే గొప్ప విజయం మరొకటి ఉండదు.

మారాల్సింది మనిషి ఆలోచనా విధానం.. మారాల్సింది సమాజం చూసే దృక్పథం. డబ్బున్నవాడే గొప్పవాడు కాదు.. మంచి మనసున్నవాడే గొప్పవాడు. అధికారంలో ఉన్నవాడే నాయకుడు కాదు.. నలుగురి కష్టాల్లో తోడుగా నిలిచేవాడే నిజమైన నాయకుడు. ఎక్కువగా మాట్లాడేవాడే మేధావి కాదు.. అవసరమైనప్పుడు మంచి మాట చెప్పి, చేతల్లో ఆదర్శంగా నిలిచేవాడే నిజమైన వ్యక్తి.

చివరగా ఒక్క విషయం గుర్తుంచుకోవాలి. మనిషి వెంట తీసుకెళ్లేది సంపద కాదు.. సమాజంలో సంపాదించుకున్న గౌరవం. మనం ఎంతకాలం బతికామన్నది కాదు.. బతికినంతకాలం ఎంతమందికి ఉపయోగపడ్డామన్నదే ముఖ్యం. మనిషి మరణించిన తర్వాత అతని ఆస్తులు వారసులకు చెందవచ్చు. కానీ అతని మంచితనం, సేవాగుణం, వ్యక్తిత్వం మాత్రం సమాజానికి ఆదర్శంగా మిగిలిపోతాయి.

అందుకే చదువు కన్నా సంస్కారానికి.. సంపద కన్నా సంతోషానికి.. కులం కన్నా గుణానికి.. మతం కన్నా మానవత్వానికి.. అధికారం కన్నా ఆత్మగౌరవానికి విలువ ఇద్దాం. మనిషిగా పుట్టినందుకు గర్వపడటం కాదు.. మంచి మనిషిగా జీవించినందుకు నలుగురి మనసుల్లో స్థానం సంపాదించుకోవడమే జీవితానికి అసలైన సార్థకత!



సీనియర్ జర్నలిస్ట్ కొట్టే సుధాకర్ (లెనిన్)
జిల్లా కార్యవర్గ సభ్యులు
తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్
సెల్: 9908401581

ఈ నెల 22న స్వేరో ఆత్మీయ సమ్మేళనం సభను విజయవంతం చేద్దాం

సబ్బండ వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలి -వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్ పిలుపు

హసన్‌పర్తి/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

ఈ నెల 22వ తేదీన హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న స్వేరో ఆత్మీయ సమ్మేళనం సభను విజయవంతం చేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ కన్వీనర్ చాతల్ల వేణుగోపాల్ పిలుపునిచ్చారు. స్వేరోస్ ఇంటర్నేషనల్ ఫౌండర్, జ్ఞానయోధ డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, ఐపీఎస్ (మాజీ అదనపు డీజీపీ) ముఖ్య అతిథిగా పాల్గొననున్న ఈ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. స్వేరో ఆత్మీయ సమ్మేళనం సభ ప్రచారంలో భాగంగా వర్ధన్నపేట నియోజకవర్గ స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఊరిబిండి ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలంలోని అన్నాసాగర్, మడిపెల్లి, జయగిరి



గ్రామాల్లో గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చాతల్ల వేణుగోపాల్ స్థానిక నాయకులతో కలిసి సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకులాల కార్యదర్శిగా పనిచేసిన సమయంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఎంతోమంది పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. ఐపీఎస్ పదవీకాలం ఇంకా ఉన్నప్పటికీ అట్టడుగు వర్గాలకు సమన్యాయం జరగాలనే సంకల్పంతో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి వచ్చారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల గొంతుకగా నిలుస్తూ సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్నారని అన్నారు.

సమాజంలోని సబ్బండ వర్గాల ప్రజలు ఈ నెల 22న హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో జరిగే స్వేరో ఆత్మీయ సమ్మేళనానికి స్వచ్ఛందంగా హాజరై సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో మడిపెల్లి సర్పంచ్ బుర్ర రంజిత్ కుమార్ గౌడ్, జయగిరి మాజీ సర్పంచులు రాజకుమార్ ముదిరాజ్, రేణుకుంట్ల అశోక్, అన్నాసాగర్ మాజీ ఉపసర్పంచ్ బండ సాగర్ రెడ్డి, పంద్యాల కుమారస్వామి గౌడ్, యువ నాయకులు కిషన్, మహేందర్, పోగుల విజయ్ కుమార్, బాబు తదితరులు పాల్గొన్నారు.

హసన్‌పర్తి నూతన మీడియా కమిటీకి ఆర్టీఐ ఘన సన్మానం

ప్రజలకు సమాచార హక్కులపై అవగాహన కల్పించడంలో పత్రికల పాత్ర కీలకం

ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు మర్రి యాదకృష్ణారెడ్డి



హసన్‌పర్తి/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): నూతనంగా ఎన్నికైన హసన్‌పర్తి మీడియా కమిటీ సభ్యులను సమాచార హక్కు వికాస సమితి (ఆర్టీఐ) ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ వ్యవస్థాపక అధ్యక్షుడు మర్రి యాదకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాచారం పొందడం ప్రతి పౌరుడి హక్కు అని పేర్కొన్నారు. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు అవినీతి రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా నిలుస్తాయని, సమాచార హక్కు చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని కోరారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా ఆర్టీఐ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సైదులు గౌడ్, రాష్ట్ర మహిళా కమిటీ అధ్యక్షురాలు ఎర్ర మాద హేమలత, ప్రధాన కార్యదర్శి కాయిత సందీప్, జిల్లా అధ్యక్షుడు టి. అరుణ్ కుమార్, సుధీర్ కుమార్‌తో పాటు హసన్‌పర్తి మీడియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలి

తల్లాడ/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

తల్లాడ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల వివరాలు, కేసుల దర్యాప్తు పురోగతిని సమగ్రంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను, సిబ్బంది పనితీరును సమీక్షించి ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని అధికారులకు సూచించారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు.





శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సెక్టార్ అధికారులతో పాటు పోలీస్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు.

క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ సిస్టమ్స్ (సీసీటీఎన్ఎస్)లో అందుబాటులోకి వస్తున్న ఆధునిక పద్ధతులను సిబ్బంది అందిపుచ్చుకోవాలని కమిషనర్ సూచించారు. పోలీస్ స్టేషన్లలో సమాచారం నమోదు, కేసుల దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగాన్ని మెరుగుపరచడంలో ఈ వ్యవస్థ కీలకమని తెలిపారు. జిల్లాలో వివిధ రకాల నేరాలకు పాల్పడుతున్న నేరస్థులను గుర్తించేందుకు ఈ ప్రాజెక్టులో ప్రవేశపెడుతున్న నూతన విధానాలపై సిబ్బంది పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

ఉన్నతాధికారులు సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టును సమర్థవంతంగా వినియోగించుకుంటే క్షేత్రస్థాయి సిబ్బంది కూడా మరింత సమర్థంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ-సమన్లు, ఈ-సాక్ష్య వంటి సాంకేతిక విధానాలను విస్తృతంగా ఉపయోగించాలని ఆదేశించారు. రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించడంతో పాటు వారిపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీస్ అధికారులకు సూచించారు.

బిల్లుపాడుకు నూతన సొసైటీ గుర్తింపు

మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయికి కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు



తల్లాడ/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామపంచాయతీని నూతన సొసైటీగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడుగునూరు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్ హర్షం వ్యక్తం చేశారు.

తల్లాడ మండలానికి చేరువలో ఉన్న బిల్లుపాడులో నూతన సొసైటీ ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. రైతులకు సహకార సేవలు మరింత చేరువవుతాయని, వ్యవసాయ అవసరాల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సెల్ తల్లాడ మండల అధ్యక్షుడు కోడూరు రాము, సర్పంచులు దీవెల వెంకటేశ్వరరావు, రామారావు, ఉప సర్పంచులు రామకృష్ణ చారి, వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాదు, కంచపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల హామీలను వెంటనే అమలు చేయాలి


250 గజాల ఇంటి స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం కల్పించాలి

సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతిపత్రం

కేసముద్రం నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి పోరాటం చేసిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కేసముద్రం మండల కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం కాట్రపల్లి గ్రామంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఉద్యమకారులకు మండల కేంద్రాల్లో 250 గజాల నివాస స్థలం, నెలకు రూ.25 వేల గౌరవ వేతనం కల్పించాలని, స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు తగిన పరిహారం అందించాలని, అర్హులైన ఉద్యమకారులకు ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు.



వినతిపై వేం నరేందర్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ ఉద్యమకారుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీంతో ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడు చాగంటి కిషన్, కోశాధికారి దామరకొండ ప్రవీణ్ కుమార్, జేఏసీ పూర్వ అధ్యక్షుడు గుగులోతు దస్రూనాయక్, మలిదశ తెలంగాణ ఉద్యమ విద్యార్థి యువజన జేఏసీ పూర్వ కన్వీనర్ దండు శ్రీనివాస్, భట్టు శ్రీను, వేల్పుల రేవంత్, కాలంగార్ బాల్ మోహన్, గాండ్ల మలేంద్రం, జనిగల పరమేశ్వర్, కీర్తి సమ్మయ్య, చాగంటి రాము, తుంపిల్ల వెంకన్న, కొలిపాక వెంకన్న, వాంకుడోత్ సూర్య నాయక్, నాగరబోయిన చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అవసరమైన సహాయక పరికరాలు అందించేందుకు ప్రత్యేక కౌంటర్లు

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయక ఉపకరణాలు అందిస్తాం -మంత్రి పొన్నం ప్రభాకర్



ఎల్కతుర్తి/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
దివ్యాంగులు, వయోవృద్ధులకు అవసరమైన సహాయక ఉపకరణాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అలింకో సంస్థ సహకారంతో దివ్యాంగులు, వయోవృద్ధులకు ఉచిత సహాయక ఉపకరణాలు అందించేందుకు ఏర్పాటు చేసిన నిర్ధారణ వైద్య శిబిరాన్ని మంత్రి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివ్యాంగులు, వయోవృద్ధులకు సేవ చేసే అవకాశాన్ని అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. వారి ఇబ్బందులను తొలగించి ఆత్మగౌరవంతో, స్వతంత్రంగా జీవించేందుకు అవసరమైన సహకారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అవసరమైన సహాయక ఉపకరణాలు అందేలా కృషి చేయాలని సూచించారు.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ అలింకో సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారి అవసరాలకు అనుగుణంగా సహాయక ఉపకరణాలను గుర్తిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ఆధారంగా అవసరమైన పరికరాలను ఎంపిక చేసి లబ్ధిదారుల రోజువారీ జీవితంలో ఇబ్బందులు తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపిక చేసిన పరికరాలను అనంతరం గ్రామాల్లోనే లబ్ధిదారులకు పంపిణీ చేస్తామని వెల్లడించారు.



అంగన్‌వాడీ టీచర్ల సేవలు అభినందనీయం
శిబిరానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి, అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక చొరవ తీసుకుని వారిని సమీకరించి వైద్య శిబిరానికి తీసుకురావడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు చేరడంలో అంగన్‌వాడీ సిబ్బంది సేవలు కీలకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డీఆర్‌డీఓ పీడీ శ్రీను, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ, అలింకో సంస్థ ప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు శుభవార్త.. ఈ నెల 19న జాబ్‌మేళా

20 సర్వీస్ ఇంజనీర్ పోస్టుల భర్తీ.. నెలకు రూ.15 వేల వేతనం



మహబూబాబాద్/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 19న మహబూబాబాద్ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి టి. రజిత తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన పవర్ లింక్ ఇన్‌ఫ్రా టెక్ ప్రైవేట్ లిమిటెడ్ (కిర్లోస్కర్ ఇంజిన్స్ లిమిటెడ్) సంస్థలో 20 సర్వీస్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ ఉద్యోగాలకు ఐటీఐ, డిప్లొమా లేదా బీటెక్ పూర్తి చేసిన 18 నుంచి 28 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశం కల్పించడంతోపాటు నెలకు రూ.15 వేల వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు. అదనంగా పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలతోపాటు రూ.6 వేల ప్రయాణ, దినభత్యం (టీఏ, డీఏ) అందజేయనున్నట్లు వివరించారు. అభ్యర్థులకు డ్రైవింగ్ లైసెన్స్, స్మార్ట్‌ఫోన్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హత ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్, పాన్‌కార్డు, ఓటరు గుర్తింపు కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో ఈ నెల 19న కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయానికి హాజరుకావాలని టి. రజిత కోరారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జనగామ మున్సిపల్ కార్యాలయంలో ఆసరా పింఛన్ మంజూరు పత్రాల పంపిణీ

లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



జనగామ/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆసరా పింఛన్ పథకంలో భాగంగా జనగామ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మూడో వార్డుకు చెందిన లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి గోపి పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రాజశేఖర్ రెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గోపి, మున్సిపల్ వైస్ చైర్మన్ భూష పర్వతాలు, వివిధ వార్డుల కౌన్సిలర్లు, మూడో వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుంటుక దామోదర్ రెడ్డి, బాలాజీనగర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ తిప్పారపు యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు చేయూత పింఛన్ పత్రాల పంపిణీ

లబ్ధిదారులకు పత్రాలు అందజేసిన సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్



స్టేషన్ ఘన్‌పూర్/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పింఛన్లలో భాగంగా మంగళవారం చిల్పూర్ మండలం ఫతేపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతన లబ్ధిదారులకు సర్పంచ్ గుగులోతు లక్ష్మీ ఉమ్లా నాయక్ పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. పెద్ద ఎత్తున నూతన లబ్ధిదారులకు చేయూత పింఛన్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి భూక్య రాజేందర్, ఉపసర్పంచ్ రంగమ్మ, వార్డు సభ్యులు బాలరాజు, మౌనిక, లక్ష్మీ, శాంతమ్మ, లలిత, మహేందర్, సుచిత్ర, వెంకటేష్, నరసింహ, కారోబార్ రతన్ సింగ్, పింఛన్ లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బిల్లుపాడుకు నూతన సొసైటీగా గుర్తింపు

మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయికి కాంగ్రెస్ నాయకుల కృతజ్ఞతలు



తల్లాడ/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తల్లాడ మండలంలోని బిల్లుపాడు గ్రామపంచాయతీని నూతన సొసైటీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌కు తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుడుగునూరు లక్ష్మారెడ్డి, సీనియర్ నాయకులు దుండేటి వీరారెడ్డి, జక్కంపూడి కిషోర్ హర్షం వ్యక్తం చేశారు.తల్లాడ మండలానికి సమీపంలో ఉన్న బిల్లుపాడులో సొసైటీ ఏర్పాటు చేయడం వల్ల చుట్టుపక్కల గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని వారు పేర్కొన్నారు. రైతులకు మరింత చేరువగా సహకార సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని ఈ సందర్భంగా అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ సెల్ తల్లాడ మండల అధ్యక్షుడు కోడూరు రాము, సర్పంచులు దీవెల వెంకటేశ్వరరావు, రామారావు, ఉపసర్పంచులు రామకృష్ణాచారి, వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ మూకర ప్రసాదు, కంచపోగు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఒక్క వాట్సాప్ సందేశం.. విద్యార్థికి అత్యవసర వైద్యం!

ఆపదలో ఉన్న విద్యార్థికి అండగా నిలిచిన డాక్టర్ మట్టా దయానంద్ దంపతులు

సమాచారం అందిన వెంటనే స్పందించి ఖమ్మంలో అత్యవసర శస్త్రచికిత్సకు చొరవ..

తల్లిదండ్రుల కృతజ్ఞతలు



కల్లూరు/ నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలంటే పెద్ద పెద్ద హామీలు అవసరం లేదు.. బాధితుల నుంచి వచ్చే ఒక్క సమాచారానికి స్పందించే మంచి మనసుంటే చాలు. సామాన్యుడి నుంచి వచ్చిన ఒక్క వాట్సాప్ సందేశం ఓ విద్యార్థికి సకాలంలో వైద్యసాయం అందేలా చేసింది. విద్యార్థి ప్రాణాపాయ పరిస్థితిని గుర్తించి తక్షణమే స్పందించిన రాష్ట్ర కాంగ్రెస్ అగ్రనేత డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ మానవతా దృక్పథం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.కల్లూరు పట్టణంలోని తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి అపెండిక్స్ సమస్యతో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తండ్రి, స్థానిక జర్నలిస్టు చెవుల నరేష్ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో తనకు తెలిసిన మార్గంలో సహాయం కోరుతూ డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌కు వాట్సాప్ ద్వారా విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని వివరించారు.సమాచారం అందిన వెంటనే స్పందించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా విద్యార్థికి అత్యవసర వైద్యం అందించేందుకు చొరవ తీసుకున్నారు. ఖమ్మంలోని ప్రముఖ ఆసుపత్రిలో విద్యార్థికి అత్యవసర శస్త్రచికిత్స జరిగేలా అవసరమైన ఏర్పాట్లకు సహకరించారు. దీంతో విద్యార్థికి సకాలంలో వైద్యసేవలు అందాయి. ఆపద సమయంలో తమకు అండగా నిలిచిన ఆయన స్పందన విద్యార్థి కుటుంబానికి ఎంతో ఊరటనిచ్చింది.సాధారణంగా ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల దృష్టికి అనేక సమస్యలు వస్తుంటాయి. అయితే వాటిలో కొన్ని సమస్యలకు తక్షణ స్పందన లభించడం బాధితులకు కొండంత అండగా నిలుస్తుంది. ఎలాంటి పరిచయాలు, ముందస్తు సమాచారం లేకుండా వచ్చిన ఒక్క వాట్సాప్ సందేశానికే స్పందించి ఓ విద్యార్థికి అత్యవసర వైద్యం అందేలా చొరవ చూపడం ఈ ఘటనలో ప్రత్యేకతగా నిలిచింది. ప్రజల కష్టాలను తమ సమస్యగా భావించి స్పందించినప్పుడే నాయకత్వానికి నిజమైన సార్థకత ఉంటుందని ఈ సంఘటన చాటిచెబుతోంది.తమ కుమారుడి ఆరోగ్య పరిస్థితి విషయంలో ఆపద సమయంలో అండగా నిలిచి, అత్యవసర వైద్యం అందేందుకు సహకరించిన డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్‌కు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు విద్యార్థి తల్లిదండ్రులు చెవుల నరేష్, భూలక్ష్మి దంపతులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ మానవతా స్పందనను పలువురు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు అభినందించారు.ఒక్క సందేశం. తక్షణ స్పందన. విద్యార్థికి అత్యవసర వైద్యం! ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన ప్రజాసేవ అని, ప్రజల పట్ల బాధ్యతను మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలనే సందేశాన్ని డాక్టర్ మట్టా దయానంద్ విజయ్‌కుమార్ స్పందన మరోసారి చాటిచెప్పింది.



మలేరియా నిర్ధారణకు రక్తపు స్మియర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వ్యాధి నియంత్రణకు ముందస్తు గుర్తింపు కీలకం -జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్

మహబూబాబాద్/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
మహబూబాబాద్ జిల్లాలో మలేరియా వ్యాధి నియంత్రణకు రక్తపు స్మియర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రవి రాథోడ్ సూచించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రామీల సమక్షంలో జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.
ఈ సందర్భంగా డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా అనుమానితుల నుంచి రక్త నమూనాలు సేకరించి, సూక్ష్మదర్శిని ద్వారా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల



వరకు పరీక్షలు నిర్వహించాలని, పరీక్షల వివరాలు, ఫలితాలను రికార్డుల్లో సక్రమంగా నమోదు చేయాలని సూచించారు. రోజువారీ, నెలవారీ నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాలని తెలిపారు.
డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రామీల మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా అనుమానిత కేసులకు సంబంధించి పాసివ్ బ్లడ్ స్మియర్లను సేకరించి పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. మలేరియా, డెంగ్యూ కేసుల సంఖ్య తగ్గించేందుకు వ్యాధి నిఘా, ముందస్తు గుర్తింపు, నివారణ చర్యలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.
ప్రతి నెల 4వ తేదీన ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి పరీక్షల పురోగతి, నివేదికలు, సూక్ష్మదర్శినుల పనితీరు, అవసరమైన ప్రయోగశాల సామగ్రిపై సమీక్షించాలని నిర్ణయించారు.
ఈ కార్యక్రమంలో డిప్యూటీ డెమో రాజకుమార్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వి. శ్రీనివాస్, అక్బర్, లావణ్య, అనిల్‌తో పాటు జిల్లాలోని ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

రూ.20 కోట్లతో రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం

అర్వణపల్లికాట్రపల్లినాగారం రోడ్డు పనులు ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి



కేసముద్రం/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
మహబూబాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా కేసముద్రం మండలంలోని అర్వణపల్లి నుంచి కాట్రపల్లి మీదుగా నాగారం వరకు రూ.20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నూతన రహదారి నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్, డీసీసీ అధ్యక్షుడు ఉమా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
సర్పంచ్ ఎదరబోయిన సూరయ్య అధ్యక్షతన జరిగిన సభలో వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. మహబూబాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తూ ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తోందని పేర్కొన్నారు.
రూ.20 కోట్లతో నిర్మించనున్న ఈ రహదారి పూర్తయితే అర్వణపల్లి, కాట్రపల్లి, నాగారం గ్రామాలతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. రైతులు వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు తరలించేందుకు వీలుకలగడంతో పాటు గ్రామాల ఆర్థిక అభివృద్ధికి దోహదపడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో మహబూబాబాద్, కేసముద్రం మున్సిపల్ చైర్‌పర్సన్లు భానోత్ సునీత వెంకన్న, జ్యోతి, వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వర్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెన్నం శ్రీకాంత్ రెడ్డి, నునావత్ రాధా, టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రు నాయక్, ఆర్టీఏ జిల్లా సభ్యుడు రావుల మురళి, నాయకులు అల్లం నాగేశ్వర్ రావు, అంబటి మహేందర్ రెడ్డి, బానోతు వెంకన్న, పాల్వాయి వెంకట్ రెడ్డి, బండారు వెంకన్న, ఉపసర్పంచ్ చాగంటి యాదగిరి, కౌన్సిలర్లు వల్లం దాస్ ఉమా-రవి, బానోత్ విజయ బద్య, వేముల భారతి, శ్రీనివాస్ రెడ్డి, కనుకుల సుభద్ర, రాంబాబు, కిషోర్, వీరేష్, మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాసరావు, అల్లం గణేష్ యాదవ్, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఆర్సీ నివేదిక బహిర్గతం చేసి వెంటనే అమలు చేయాలి

గురుకులాలకు కేర్‌టేకర్లు, వార్డెన్లను నియమించాలి -సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్





హసన్‌పర్తి/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు డిమాండ్ చేశారు. మంగళవారం హసన్‌పర్తి మండలంలోని వివిధ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవన్నపేట, సుబ్బయ్యపల్లి గురుకుల పాఠశాలల్లో జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు.అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపు పీఆర్సీ అమలు చేస్తామని, పెండింగ్ డీఏలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం 40 నెలలు గడిచినా హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీ నివేదికను బహిర్గతం చేసి అమలు చేయాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో కేర్‌టేకర్లు, వార్డెన్లను నియమించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగించరాదని స్పష్టం చేశారు. బీసీ గురుకులాల పనివేళలను మార్చాలని కోరారు.సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు జీరో వన్ జీరో విధానం ద్వారా వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ సిబ్బందికి కనీస వేతన స్కేలు అమలు చేయాలని, ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసే జీవో నంబర్ 25ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ హసన్‌పర్తి మండల శాఖ అధ్యక్షురాలు రమాదేవి, ప్రధాన కార్యదర్శి నరేష్, సీనియర్ నాయకులు వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు..

అర్హులందరికీ ప్రభుత్వ అండ!

సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట ఎంపీ కడియం కావ్య.. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



















వర్ధన్నపేట/నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త):
అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.ఐనవోలు మండలం నందనంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఐనవోలు మండలం, వర్ధన్నపేట మండలం, వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని చేయూత పింఛన్ లబ్ధిదారులకు నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ సంక్షేమ పాలనకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పింఛన్ కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, వృద్ధులు, దివ్యాంగులు, ఇతర అర్హులైన లబ్ధిదారులు ఆత్మగౌరవంతో జీవించేందుకు కల్పించే భరోసా అని వివరించారు. ప్రతి నెలా అందే పింఛన్‌తో కుటుంబ అవసరాలను తీర్చుకోవడంలో కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతుందని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు.

సంక్షేమమే సామాజిక భద్రతకు పునాది

వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు అందించే పింఛన్లు సామాజిక భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. నెలవారీ ఆర్థిక సహాయం ద్వారా లబ్ధిదారులకు కుటుంబ అవసరాలను తీర్చుకునే అవకాశం కలుగుతోంది. అర్హులందరికీ పథకాల ప్రయోజనాలు చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయడం సంక్షేమ పాలనను మరింత బలోపేతం చేస్తుంది.ఈ కార్యక్రమంలో ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్, వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిబారాణి రాజేందర్, వర్ధన్నపేట పీఏసీఎస్ చైర్మన్ అబ్బిడి రాజిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, మాజీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, జేబీఎం చైర్మన్ జన్నపురెడ్డి రుగ్వేద్ రెడ్డి, యువజన అధ్యక్షుడు భాను ప్రసాద్, డైరెక్టర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, వర్ధన్నపేట ఎంపిడిఓ వెంకటరమణ తహసీల్దార్ విజయసాగర్, గ్రామ సెక్రెటరీ లు, ఎపిఎం రమణాచారి,వర్ధన్నపేట సీ ఐ, ఎస్సై పర్వతగిరి సి ఐ, ఎస్సై, పోలీస్ సిబ్బంది. ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, పింఛన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అప్పగించే బియ్యం లెక్కలపై పర్యవేక్షణ ఏదీ?

రైస్ మిల్లుల్లో తనిఖీలు జరుగుతున్నాయా?

వర్ధన్నపేట/నవంబర్ 17(జర్నలిస్ట్ వార్త):
ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, మర ఆడించి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించే బాధ్యతను రైస్ మిల్లులకు అప్పగిస్తోంది. అయితే ధాన్యం ఎంత తీసుకున్నారు? మర ఆడించిన తర్వాత ఎంత బియ్యం రావాలి? ప్రభుత్వానికి ఎంత అప్పగించారు? మిల్లుల్లో ఇంకా ఎంత నిల్వ ఉంది? అనే లెక్కలపై క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఎలా సాగుతోందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
ధాన్యం సేకరణ నుంచి బియ్యం అప్పగింత వరకు ప్రతి దశలో స్పష్టమైన లెక్కలు ఉండాల్సిందే. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం మిల్లర్లు బియ్యాన్ని అప్పగించాలి. కానీ ధాన్యం కేటాయింపులు, మర ఆడింపు, బియ్యం దిగుబడి, నిల్వలు, ప్రభుత్వానికి అప్పగించిన పరిమాణం వంటి వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.
మిల్లుల వారీగా కేటాయించిన ధాన్యం వివరాలు, అప్పగించాల్సిన బియ్యం పరిమాణం, ఇప్పటివరకు అప్పగించిన బియ్యం, ఇంకా బకాయి ఉన్న నిల్వల వివరాలను అధికారులు బహిర్గతం చేయాల్సిన అవసరం ఉంది. లెక్కల్లో తేడాలు ఉంటే వాటికి కారణాలు ఏమిటి? నిర్ణీత గడువులో బియ్యం అప్పగించని మిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? తనిఖీల్లో ఏమి గుర్తించారు? అన్నది ప్రజలకు తెలియాలి.
ప్రభుత్వ ధాన్యం అంటే ప్రజాధనం. రైతుల నుంచి సేకరించిన ధాన్యం చివరకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు చేరాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎక్కడైనా నిర్లక్ష్యం లేదా అక్రమాలకు అవకాశం లేకుండా పౌరసరఫరాల శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలి.
వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని రైస్ మిల్లుల వారీగా ధాన్యం కేటాయింపులు, బియ్యం అప్పగింతలు, బకాయిలు, తనిఖీల వివరాలను అధికారులు వెల్లడిస్తారా? లెక్కలు పారదర్శకంగా ఉంటే సందేహాలకు తావుండదు. ప్రజాధనానికి సంబంధించిన ఈ వ్యవహారంలో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

ఎన్నికల హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెరవేర్చాలి

జేఏసీ చైర్మన్ వకలాభరణం నర్సయ్య పంతులు డిమాండ్



జనగామ/చేర్యాల నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే నెరవేర్చాలని చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం జేఏసీ చైర్మన్ వకలాభరణం నర్సయ్య పంతులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని రెవెన్యూ డివిజన్ సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు.
ఈ సందర్భంగా నర్సయ్య పంతులు మాట్లాడుతూ 2023 ఎన్నికల సమయంలో జనగామలో నిర్వహించిన బహిరంగ సభలో అప్పటి పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ గెలిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటివరకు హామీ అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు.ఈ నెల 19న ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వస్తున్న నేపథ్యంలో అదే సభలో చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని జేఏసీ విజ్ఞప్తి చేసింది. గతంలో జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్, రాజీవ్ రహదారి, అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాలు నిర్వహించినా ప్రభుత్వం స్పందించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. సిద్దిపేట సభలో రెవెన్యూ డివిజన్ ప్రకటన చేయకపోతే ఈ ప్రాంత కాంగ్రెస్ నాయకులను ప్రజలు తిరగనీయరని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు ముత్యాల బాల్ నర్సయ్య, సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణరెడ్డితో పాటు ముత్యాల నాగేశ్వరరావు, మంచాల కొండయ్య, పోతుగంటి రాందాసు, సర్పంచ్ పాండు పటేల్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, అరుణ్‌కుమార్, మాజీ సర్పంచ్ రవీందర్, గర్నెపెల్లి రాము, బంగారుగళ్ల కిరణ్, సిద్ధిలింగం, ఇన్నారెడ్డి, సుదర్శన్ గౌడ్, తేలు ఇస్తారి, శ్రీహరి రాజు, మైసయ్య, మాజీ సర్పంచ్ అంజయ్య, ఆవుచెర్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించాలి

ఫ్యూచర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంపీడీవోకు వినతి



జనగామ/బచ్చన్నపేట నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): బచ్చన్నపేట మండల కేంద్రంలో 2018లో మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల, తెలంగాణ బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలకు స్థలాలు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మించాలని ఫ్యూచర్ సొసైటీ చైర్మన్ మహేందర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు.2018లో ప్రభుత్వం బచ్చన్నపేటకు బాలికల కోసం మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను, బాలుర కోసం బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలను మంజూరు చేసింది. అయితే శాశ్వత భవనాలు లేవనే కారణంతో బాలికల పాఠశాలను పెంబర్తి గ్రామానికి, బాలుర పాఠశాలను జనగామకు తరలించారు. దీంతో బచ్చన్నపేట మండలానికి చెందిన విద్యార్థినీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన పేర్కొన్నారు.అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి బచ్చన్నపేట మండల కేంద్రంలో గురుకుల పాఠశాలలకు స్థలాలు కేటాయించి, శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ శ్రీనివాస్, శిరిపాటి అరుణ్ కుమార్, మంగళంపల్లి భాస్కర్, ఆర్య మోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం

దబ్బగుంటపల్లి పాఠశాల ఆదర్శం.. సాయి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

జనగామ/బచ్చన్నపేట, నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా దబ్బగుంటపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆదర్శంగా నిలుస్తోందని ఎంఈఓ పండరి బాలకిషన్ రావు అన్నారు. సోమవారం మండలంలోని దబ్బగుంటపల్లి పాఠశాలలో సాయి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోషకాహారంలో భాగంగా అరటిపండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గత మూడేళ్లుగా ట్రస్ట్ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ప్రతిరోజూ ఉదయం విద్యార్థులకు అరటిపండ్లు, సాయంత్రం వేరుశనగ కిచిడీ అందించడం ద్వారా వారి ఆరోగ్య పరిరక్షణకు సంస్థ కృషి చేస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల సంక్షేమానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంతం చంద్రకళ, సాయి రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కర్నల్ డాక్టర్ సి. నరేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.


పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్‌బీఆర్ఎస్ నాయకుల ఘర్షణ

పోలీసుల లాఠీచార్జ్.. పలువురికి స్వల్ప గాయాలు

పెన్షన్ పత్రాలు తీసుకోకుండానే వెనుదిరిగిన లబ్ధిదారులు

జనగామ/చేర్యాల నవంబర్ 17 (జర్నలిస్ట్ వార్త): చేర్యాల పట్టణంలోని రేణుక గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన నూతన ఆసరా పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం కాస్త ఘర్షణకు దారితీయడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో ఇరు పార్టీలకు చెందిన పలువురు నాయకులు స్వల్పంగా గాయపడ్డారు. కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇరు పార్టీల నాయకులు తమ తమ నాయకులకు అనుకూలంగా నినాదాలు చేయడంతో వాతావరణం వేడెక్కింది. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జ్ చేశారు. అనంతరం ఇరువర్గాలను చెదరగొట్టారు.ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రతి నిరుపేద కుటుంబానికి అందించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలోనే అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించామని పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే ప్రసంగిస్తున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు వ్యతిరేక నినాదాలు చేయడంతో ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు మరోసారి వివాదానికి దారితీశాయి. దీంతో కాంగ్రెస్ నాయకులు సభా ప్రాంగణానికి చేరుకుని ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి కార్యకర్తలకు సర్దిచెప్పడంతో పరిస్థితి కొంతవరకు సద్దుమణిగింది.ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ఎమ్మెల్యే రాజకీయ వైరుధ్యాలను పెంచుతూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. కాగా, కార్యక్రమంలో చోటుచేసుకున్న గందరగోళంతో తీవ్ర అసంతృప్తికి గురైన పింఛన్ లబ్ధిదారులు మంజూరు పత్రాలు తీసుకోకుండానే వెనుదిరగడం చర్చనీయాంశంగా మారింది

కోహ్లీ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్ సంచలన వ్యాఖ్యలు!



టెస్టులకు వీడ్కోలు పలకడం కెరీర్‌లోనే పెద్ద తప్పిదం

పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ బాధపడతాడన్న దిగ్గజ క్రికెటర్

న్యూఢిల్లీ: భారత క్రికెట్ దిగ్గజం, 1983 ప్రపంచకప్ విజేత కెప్టెన్ కపిల్ దేవ్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టెస్టులకు వీడ్కోలు పలకడం కోహ్లీ కెరీర్‌లోనే అతిపెద్ద తప్పిదమని అభిప్రాయపడ్డారు. పదేళ్ల తర్వాత తన నిర్ణయంపై కోహ్లీ పశ్చాత్తాపపడతాడని వ్యాఖ్యానించారు. అద్భుతమైన ఫిట్‌నెస్ కలిగిన కోహ్లీ మరికొంత కాలం టెస్టు క్రికెట్‌లో కొనసాగాల్సిందని పేర్కొన్నారు.మిడ్‌డేతో మాట్లాడిన కపిల్ దేవ్.. కోహ్లీ ఫిట్‌నెస్ ఏ ఇతర ఆటగాడికీ తీసిపోదని, 25 ఏళ్ల యువ క్రికెటర్‌తోనూ పోటీపడగల సామర్థ్యం అతనికి ఉందని ప్రశంసించారు. ఇంతటి శారీరక సామర్థ్యం ఉన్న ఆటగాడు టెస్టులకు వీడ్కోలు పలకడం సరైన నిర్ణయం కాదన్నారు.**మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి**కష్టకాలంలో ఆగ్రహంతో రిటైర్మెంట్ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని కపిల్ హితవు పలికారు. మాజీ క్రికెటర్ మోహిందర్ అమర్‌నాథ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అమర్‌నాథ్ పలుమార్లు జట్టులో స్థానం కోల్పోయినా తిరిగి పుంజుకుని తన ప్రతిభను నిరూపించుకున్నారని గుర్తుచేశారు. ఆటగాళ్లు కూడా విమర్శలు, ఒడిదుడుకులకు కుంగిపోకుండా తిరిగి జట్టులో స్థానం సంపాదించేందుకు ప్రయత్నించాలని అన్నారు.**123 టెస్టుల్లో 9,230 పరుగులు** విరాట్ కోహ్లీ 2025 మే 12న టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. 14 ఏళ్ల టెస్టు కెరీర్‌లో 123 మ్యాచ్‌లు ఆడి 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించారు. ఇందులో 30 సెంచరీలు, 31 అర్ధసెంచరీలు ఉన్నాయి. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత టీ20 అంతర్జాతీయ క్రికెట్‌కు కూడా వీడ్కోలు పలికారు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు.కోహ్లీతో పాటు రోహిత్ శర్మ భవిష్యత్తుపైనా కపిల్ దేవ్ స్పందించారు. ఆటగాళ్ల భవిష్యత్తును ఎంపిక సంఘమే నిర్ణయించాలని, దేశానికి సేవలందించిన ప్రతి ఆటగాడూ ఏదో ఒక దశలో ఆటకు వీడ్కోలు పలకాల్సిందేనని పేర్కొన్నారు.

ధోనీ అభిమానులకు భారీ షాక్!



- ఐపీఎల్‌కు ఆటగాడిగా వీడ్కోలు.. చెన్నై సూపర్ కింగ్స్‌కు కొత్త బాధ్యతల్లో ధోనీ

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అభిమానులకు షాకింగ్ న్యూస్. ఐపీఎల్‌లో ఆటగాడిగా తన ప్రస్థానానికి ధోనీ ముగింపు పలికారు. 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. అయితే ఆటగాడిగా తప్పుకున్నప్పటికీ ధోనీ చెన్నై జట్టుతోనే కొనసాగనున్నారు. ఇకపై జట్టుకు మెంటార్‌గా వ్యవహరించనున్నారు.**మెంటార్‌గా కొత్త బాధ్యతలు** 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పటి నుంచి చెన్నై సూపర్ కింగ్స్‌కు ధోనీ కీలక ఆటగాడిగా కొనసాగారు. ఆయన నాయకత్వంలో సీఎస్కే ఐదు ఐపీఎల్ టైటిళ్లను సాధించింది. ధోనీ రిటైర్మెంట్‌పై జట్టు యాజమాన్యం భావోద్వేగ స్పందన తెలిపింది. ధోనీ లేకుండా చెన్నై సూపర్ కింగ్స్‌ను ఊహించలేమని జట్టు యజమాని ఎన్. శ్రీనివాసన్ పేర్కొన్నారు. 2008లో ధోనీని జట్టులోకి తీసుకోవడం తన అత్యుత్తమ నిర్ణయమని కొనియాడారు.**గాయాల కారణంగా నిర్ణయం** గత కొంతకాలంగా గాయాలతో ఇబ్బందిపడుతున్న ధోనీ 2026 ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరంగా ఉన్నారు. తన శారీరక సామర్థ్యాన్ని పరీక్షించుకున్న అనంతరం ఆటగాడిగా కొనసాగడం కష్టమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెంటార్‌గా యువ ఆటగాళ్లకు తన అనుభవాన్ని పంచుకోనున్నారు.**ఐపీఎల్‌లో ధోనీ ఘనతలు**ధోనీ మొత్తం 278 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడి 5,439 పరుగులు సాధించారు. కెప్టెన్‌గా 235 మ్యాచ్‌లకు నాయకత్వం వహించి 136 విజయాలు అందించారు. 2010, 2011, 2018, 2021, 2023లో చెన్నైకి ఐదు టైటిళ్లు అందించారు. ఆటగాడిగా మైదానంలో కనిపించకపోయినా మెంటార్‌గా చెన్నై జట్టుతో కొన సాగనుండటంతో అభిమానులకు కొంత ఊరట లభించనుంది.

కివీస్‌పై పేస్ దాడికి గిల్ వ్యూహం!

నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి భారత్.. తుది జట్టుపై కెప్టెన్ కసరత్తు

వెల్లింగ్టన్: న్యూజిలాండ్‌తో జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో భారత జట్టు నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగనుంది. ఈ విషయాన్ని భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ స్పష్టం చేశారు. గురువారం (నవంబర్ 19) నుంచి ప్రారంభమయ్యే తొలి టెస్టుకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ జట్టు కూర్పుపై వివరాలు వెల్లడించారు. ఏడుగురు ప్రధాన బ్యాటర్లతో పాటు నలుగురు పేసర్లను ఆడించాలని నిర్ణయించినట్లు తెలిపారు.**పేసర్ల ఎంపికపై తర్జనభర్జన** ప్రస్తుతం భారత జట్టులో ఫాస్ట్ బౌలర్లందరూ మంచి ఫామ్‌లో ఉండటంతో తుది జట్టును ఎంపిక చేయడం కష్టంగా మారిందని గిల్ అన్నారు. జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, అన్షుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్ వంటి బౌలర్లు అందుబాటులో ఉన్నారు. వీరిలో ఎవరిని ఎంపిక చేయాలన్నది జట్టు యాజమాన్యానికి సవాలుగా మారిందని పేర్కొన్నారు.మ్యాచ్ తొలి రెండు రోజుల్లో పిచ్ నుంచి పేసర్లకు సహకారం లభించే అవకాశం ఉందని, మూడో రోజు నుంచి వికెట్ నెమ్మదిగా మారుతుందని గిల్ వివరించారు. పాత బంతితోనూ వికెట్లు తీయగలిగే వేగవంతమైన బౌలర్లు జట్టుకు



అవసరమని తెలిపారు. బలమైన గాలులు వీచే పరిస్థితుల్లో బౌలర్లపై అదనపు ఒత్తిడి ఉంటుందని, అందుకు అనుగుణంగా బౌలింగ్ కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు.**ఏడుగురు బ్యాటర్లతో బరిలోకి**జట్టులో ఏడుగురు ప్రధాన బ్యాటర్లను ఆడించాలని భావిస్తున్నట్లు గిల్ వెల్లడించారు. ఎనిమిది, తొమ్మిది స్థానాల్లో బ్యాటింగ్ చేయగల బౌలర్లను ఎంపిక చేయడంపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఆకాశ్ దీప్, అన్షుల్ కాంబోజ్ బ్యాటింగ్ చేయగలరని, నితీశ్ కుమార్ రెడ్డి కూడా మంచి బ్యాటర్ అని పేర్కొన్నారు. జట్టు అవసరాలకు అనుగుణంగా తుది కూర్పును నిర్ణయిస్తామని చెప్పారు.**రిషభ్ పంత్‌కు కెప్టెన్ మద్దతు**వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఫిట్‌నెస్, ఫామ్‌పై వస్తున్న సందేహాలను గిల్ తోసిపుచ్చారు. సుమారు 50 టెస్టులు ఆడిన అనుభవం పంత్‌కు ఉందని, విదేశీ గడ్డలపై కూడా అద్భుతంగా రాణించాడని ప్రశంసించారు. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్‌లలో సెంచరీలు సాధించిన పంత్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు.**డబ్ల్యూటీసీ ఫైనలే లక్ష్యం** న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల్లోనూ విజయం సాధిస్తే ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు చేరుకునే అవకాశాలు మెరుగవుతాయని గిల్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సిరీస్‌కు మెరుగైన సన్నద్ధత కల్పించేందుకే వన్డే జట్టు నుంచి కొందరు ఆటగాళ్లను ముందుగానే విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికే టీ20, వన్డే సిరీస్‌లను గెలిచిన భారత్ టెస్టు సిరీస్‌ను కూడా కైవసం చేసుకుని న్యూజిలాండ్ పర్యటనను ఘనంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.



రాజస్థాన్ రాయల్స్‌లోకి మహ్మద్ షమీ..!

ఐపీఎల్-2027కు ముందే కీలక ఆటగాళ్ల బదిలీ

లఖ్‌నవూతో రాజస్థాన్ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్.. శామ్ కరన్ మరో జట్టుకు

న్యూఢిల్లీ: ఐపీఎల్-2027 సీజన్‌కు ముందే జట్ల మధ్య ఆటగాళ్ల మార్పిడి ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. ఇందులో భాగంగా రాజస్థాన్ రాయల్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్ల మధ్య కీలక ఒప్పందం కుదిరింది. ఈ మల్టీ ప్లేయర్ ట్రేడ్ డీల్‌లో భాగంగా భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ రాజస్థాన్ రాయల్స్ జట్టులో చేరగా, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు మారాడు. వీరితో పాటు స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ కూడా రాజస్థాన్ జట్టులోకి వచ్చాడు. వచ్చే సీజన్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో రెండు జట్లు తమ ఆటగాళ్ల బలాబలాలను మార్చుకుంటున్నాయి.**రూ.8 కోట్లకు షమీ కొనుగోలు** ఈ ఒప్పందంలో ప్రధాన ఆకర్షణ మహ్మద్ షమీ. 35 ఏళ్ల ఈ భారత పేసర్‌ను రాజస్థాన్ రాయల్స్ రూ.8 కోట్లకు సొంతం చేసుకుంది. గతంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ షమీని రూ.10 కోట్లకు తీసుకుంది. తాజా ట్రేడ్ ఒప్పందంలో అతడి ధర



రూ.2 కోట్లు తగ్గింది. అంతర్జాతీయ క్రికెట్‌లో విశేష అనుభవం ఉన్న షమీ రాకతో రాజస్థాన్ బౌలింగ్ విభాగానికి మరింత బలం చేకూరనుంది.షమీకి కొత్త బంతితో వికెట్లు తీయడంలో ప్రత్యేక నైపుణ్యం ఉంది. ముఖ్యంగా పవర్‌ప్లేలో ప్రత్యర్థి బ్యాటర్లను ఇబ్బందులకు గురిచేయగలడు. బంతిని రెండు వైపులా స్వింగ్ చేయడంతో పాటు కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేయడం అతడి ప్రత్యేకత. అనుభవజ్ఞుడైన బౌలర్ కావడంతో కీలక సమయాల్లో జట్టుకు ఉపయోగపడే అవకాశం ఉంది.**ఐపీఎల్‌లో షమీ ఘన గణాంకాలు** మహ్మద్ షమీ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. పవర్‌ప్లేలో వికెట్లు సాధించడంలో అతడికి మంచి రికార్డు ఉంది. కొత్త బంతితో పాటు పాత బంతితోనూ బౌలింగ్ చేయగల సామర్థ్యం షమీ సొంతం. అతడి అనుభవం రాజస్థాన్ యువ బౌలర్లకు కూడా ఉపయోగపడనుంది. వచ్చే సీజన్‌లో రాజస్థాన్ తరఫున షమీ ఎలా రాణిస్తాడన్నది క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది.**లఖ్‌నవూకు శామ్ కరన్ అస్త్రం** మరోవైపు రాజస్థాన్ రాయల్స్ నుంచి ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ శామ్ కరన్ లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌లో చేరాడు. అతడిని రూ.2.4 కోట్ల ధరతో లఖ్‌నవూ దక్కించుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ రాణించగల సామర్థ్యం కరన్ ప్రత్యేకత. అవసరమైన సమయంలో వేగంగా పరుగులు సాధించడంతో పాటు బౌలింగ్‌లోనూ కీలక వికెట్లు తీయగలడు.కరన్ ఇప్పటివరకు ఐపీఎల్‌లో 997 పరుగులు చేయడంతో పాటు 59 వికెట్లు సాధించాడు. ఆల్‌రౌండర్‌గా అతడి సేవలు లఖ్‌నవూ జట్టుకు ఉపయోగపడనున్నాయి. జట్టు కూర్పులో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాలకు సమతుల్యత తీసుకురావడంలో కరన్ కీలకంగా మారే అవకాశముంది.

అంతర్జాతీయ స్థాయిలో మను భాకర్‌కు

అరుదైన గుర్తింపు!

- **20262030 కాలానికి ఐఎస్ఎస్ఎఫ్ అథ్లెట్ల కమిటీలో సభ్యురాలిగా ఎన్నిక**
- **క్రీడాకారుల సమస్యల పరిష్కారానికి ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం**

న్యూఢిల్లీ: భారత షూటింగ్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ షూటింగ్ క్రీడల సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) అథ్లెట్ల కమిటీ సభ్యురాలిగా ఆమె ఎన్నికయ్యారు. 2026 నుంచి 2030 వరకు నాలుగేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ విషయాన్ని భారత జాతీయ రైఫిల్ సంఘం అధికారికంగా వెల్లడించింది.**22 మంది అభ్యర్థుల నుంచి ఎన్నిక** ప్రపంచవ్యాప్తంగా 20 దేశాలకు చెందిన 22 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీపడ్డారు. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల నుంచి ఇద్దరు చొప్పున మొత్తం ఆరుగురు సభ్యులను క్రీడాకారుల ఓటింగ్ ద్వారా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలు ఈజిప్టులోని కైరో, ఖతార్‌లోని దోహాలో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల సందర్భంగా ఆన్‌లైన్‌లో నిర్వహించారు. పిస్టల్ విభాగానికి ప్రాతినిధ్యం వహిస్తూ మను భాకర్ ఈ పదవిని దక్కించుకున్నారు.**క్రీడాకారుల సమస్యల పరిష్కారమే లక్ష్యం** తన ఎన్నికపై మను భాకర్ సంతోషం వ్యక్తం చేశారు. తనపై నమ్మకం ఉంచి ఓటు వేసిన తోటి షూటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారుల సమస్యలు, అవసరాలు సమర్థవంతంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పోటీ నిబంధనలు, షెడ్యూళ్లలో స్పష్టత తీసుకురావడంతో పాటు క్రీడాకారులకు మెరుగైన సహాయక వ్యవస్థలు కల్పించేందుకు ప్రయత్నిస్తానని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడం కూడా తన లక్ష్యమని తెలిపారు.**ఒలింపిక్ పతకాలతో ప్రత్యేక గుర్తింపు** 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మను భాకర్ రెండు కాంస్య పతకాలు సాధించి చరిత్ర సృష్టించారు. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన స్వతంత్ర భారత తొలి క్రీడాకారిణిగా గుర్తింపు పొందారు. ఆమె ఎన్నికతో అంతర్జాతీయ షూటింగ్ రంగంలో భారత క్రీడాకారుల గొంతుకకు మరింత ప్రాధాన్యత లభించనుంది. 2028 లాస్‌ఏంజెలెస్ ఒలింపిక్స్‌కు ముందు ఆమెకు ఈ బాధ్యత దక్కడం విశేషం.



పాత్ర కోసం జుట్టు కత్తిరించుకున్న సాయి పల్లవి!

- కొత్త లుక్ చూసి షాకైన తల్లి.. వీడియో కాల్ కట్

- విగ్గు పెట్టుకున్నావా అంటూ ఆరా తీసిన తండ్రి

హైదరాబాద్: సహజ నటనతో ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న హీరోయిన్ సాయి పల్లవి తన కొత్త సినిమా కోసం చేసిన సాహసోపేతమైన మార్పు ఆసక్తికరంగా మారింది. ధనుష్ హీరోగా నటిస్తున్న 'ఓం: చాప్టర్ 1 ఉధిరమ్: ది బ్లడ్ వుడ్' సినిమా కోసం ఆమె తన పొడవాటి జుట్టును కత్తిరించుకున్నారు. అయితే సాయి పల్లవి తీసుకున్న ఈ నిర్ణయం ఆమె తల్లిదండ్రులకు ఆశ్చర్యం కలిగించింది. ముఖ్యంగా కొత్త లుక్ చూసిన తల్లి షాక్‌కు గురై వీడియో కాల్ కట్ చేశారట. ఈ విషయాన్ని సాయి పల్లవే ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పాత్ర కోసం పూర్తిగా మారిపోయా

దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి చెప్పిన కథ తనకు బాగా నచ్చిందని సాయి పల్లవి తెలిపారు. సినిమాలోని పాత్రకు తగ్గట్టుగా తన రూపాన్ని మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. ఇందులో ఆమె నిత్యారెడ్డి అనే పోలీసు అధికారిణి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం దర్శకుడు నిజ జీవిత ఐపీఎస్ అధికారి మెరిన్ జోసెఫ్ రూపాన్ని స్ఫూర్తిగా తీసుకున్నారు. ఆమె మాదిరిగా చిన్న జుట్టుతో కనిపించాలనే ఉద్దేశంతో సాయి పల్లవి నిజంగానే జుట్టు కత్తిరించుకున్నారు.

తల్లి షాక్.. తండ్రికి అనుమానం


జుట్టు కత్తిరించుకున్న తర్వాత తన కొత్త రూపాన్ని ముందుగా తల్లికి వీడియో కాల్‌లో చూపించానని సాయి పల్లవి చెప్పారు. తనను ఆ రూపంలో చూసిన తల్లి ఒక్కసారిగా ఆశ్చర్యపోయి ఎందుకు జుట్టు కత్తిరించుకున్నావంటూ ప్రశ్నించారని, ఆ తర్వాత ఫోన్ పెట్టేశారని తెలిపారు. అనంతరం తండ్రి ఫోన్ చేసి, పల్లవి.. అది విగ్గు కదా? అని అడిగారని చెప్పారు. తాను నిజంగానే జుట్టు కత్తిరించుకున్నానని, సినిమా పాత్ర కోసమే ఈ నిర్ణయం తీసుకున్నానని వివరించానన్నారు. కొత్త రూపానికి అలవాటు పడటానికి తల్లిదండ్రులకు కొంత సమయం పట్టిందని నవ్వుతూ వెల్లడించారు.

నవంబర్ 20న సినిమా విడుదల

రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల, నసీరుద్దీన్ షా తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నేపథ్యంలో సాగే కథలో సాయి పల్లవి పోలీసు అధి కా రి ణి గా

నెట్‌ఫ్లిక్స్‌లో 'రణబాలి' ప్రభంజనం..

విజయ్ నటనకు ప్రేక్షకుల ప్రశంసలు!



విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన చారిత్రక నేపథ్య యాక్షన్ చిత్రం 'రణబాలి' ఓటీటీలో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. థియేటర్లలో విడుదలైన తర్వాత మిశ్రమ స్పందన అందుకున్న ఈ చిత్రం.. నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం మరోసారి వార్తల్లో నిలిచింది. నవంబర్ 13 నుంచి తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ సినిమాకు వివిధ ప్రాంతాల ప్రేక్షకుల నుంచి స్పందన లభిస్తోంది.

టాప్-10 జాబితాలో రెండో స్థానం

నెట్‌ఫ్లిక్స్ ఇండియా సినిమా విభాగంలో 'రణబాలి' రెండో స్థానానికి చేరినట్లు సినీ వర్గాల కథనాలు వెల్లడించాయి. థియేటర్లలో సినిమా చూడలేకపోయిన ప్రేక్షకులు ఇప్పుడు ఓటీటీలో వీక్షిస్తున్నారు. ముఖ్యంగా హిందీ ప్రేక్షకుల నుంచి కూడా ఆసక్తి కనిపిస్తుండటంతో సినిమాకు కొత్త ప్రేక్షకులు చేరుతున్నారు. డిజిటల్ విడుదలతో ఈ చిత్రంపై చర్చ మళ్లీ మొదలైంది.

విజయ్ నటనకు ప్రశంసలు

ఈ సినిమాలో విజయ్ దేవరకొండ చేసిన శారీరక మార్పు, కఠినమైన రూపం, ఆవేశభరితమైన నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. పాత్రలోని తీవ్రతను తెరపై చూపించిన తీరు అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా సినిమాలోని 'గాడ్ సీన్' సామాజిక మాధ్యమాల్లో ప్రత్యేకంగా చర్చకు వస్తోంది. ఆ సన్నివేశంలో విజయ్ ప్రదర్శించిన నటన, తెరపై ఆయన ఉనికి అద్భుతంగా ఉన్నాయంటూ పలువురు అభిమానులు స్పందిస్తున్నారు. కొందరు ఆయనకు జాతీయ అవార్డు రావాలని కూడా అభిప్రాయపడుతున్నారు.

రష్మిక నటనపైనా చర్చ

ఈ చిత్రంలో జయమ్మ పాత్రలో నటించిన రష్మిక మందన్నకు కూడా మంచి స్పందన లభిస్తోంది. విజయ్, రష్మికల మధ్య తెరపై కనిపించిన అనుబంధం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ప్రధాన జంట నటనతో పాటు దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ కథను తెరకెక్కించిన విధానంపై కూడా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

బ్రిటన్‌లోనూ చర్చకు దారితీసిన కథాంశం

బ్రిటిష్ వలస పాలన కాలంలో జరిగిన ఘటనల నేపథ్యంతో రూపొందిన ఈ సినిమా విదేశీ ప్రేక్షకుల దృష్టిని కూడా ఆకర్షిస్తోంది.

అది అప్పుడూ ఉంది.. ఇప్పుడూ ఉంది

: కాస్టింగ్ కౌచ్‌పై రమ్యకృష్ణ షాకింగ్ కామెంట్స్!



సినీ పరిశ్రమలో ఎప్పటినుంచో చర్చనీయాంశంగా ఉన్న 'కాస్టింగ్ కౌచ్'పై సీనియర్ నటి రమ్యకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. చిత్ర పరిశ్రమలో ఈ తరహా వేధింపులు అప్పుడూ ఉన్నాయని, ఇప్పుడూ ఉన్నాయని, భవిష్యత్తులో కూడా ఉంటాయని ఆమె స్పష్టం చేశారు. ఈ దోపిడీ కేవలం ఒక పరిశ్రమకే పరిమితం కాదని, లింగ భేదం లేకుండా అన్ని రంగాల్లోనూ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. "అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలోనే ఎప్‌స్టీన్ ఫైల్స్ లాంటివి బయటపడ్డాయి. అక్కడ మహిళలు ఎంతో ముందున్నా అలాంటివి ఎదుర్కోవాల్సి వచ్చింది. కాబట్టి ఇక్కడ జరగదని చెప్పలేం. ఇష్టంతోనో, బలవంతంగానో, మామూలుగానో.. అది జరుగుతూనే ఉంటుంది. దీన్ని ఎవరూ కాదనలేరు. మనది గ్లామర్ ప్రపంచం కాబట్టి దీని గురించి ఎక్కువగా మాట్లాడుకుంటారు. బయట కూడా ఎంతోమంది మహిళలు ఇలాంటివి ఎదుర్కొంటున్నారు" అని వివరించారు. గతంలో చిత్ర పరిశ్రమలో తాము ఎదుర్కొన్న కష్టాలను కూడా రమ్యకృష్ణ గుర్తుచేసుకున్నారు. ఆ రోజుల్లో ఫిల్మ్ సెట్లలో కనీసం వాష్‌రూమ్‌లు, క్యారవాన్‌లు ఉండేవి కావని తెలిపారు. బట్టలు మార్చుకోవడానికి కూడా సరైన ప్రైవసీ ఉండేది కాదని, అంబాసిడర్ కార్లలో కూర్చుని బాటిళ్లలోనే మూత్ర విసర్జన చేసిన సందర్భాలున్నాయని చెప్పారు. ఆ కష్టాలతో పోలిస్తే ఇప్పటి నటీనటులు చాలా అదృష్టవంతులని, తాము పడిన కష్టాల్లో పావు వంతు కూడా వారు అనుభవించలేదని అన్నారు. ఇక, సినిమాల విషయానికొస్తే.. రమ్యకృష్ణ ఇటీవల రజనీకాంత్‌తో కలిసి 'జైలర్ 2'లో నటించారు. వీటితో పాటు 'రాకా', 'శ్రీ శ్రీ', 'పాకెట్ నావెల్', 'తేరా యార్ హూ మే' వంటి చిత్రాలు ఆమె చేతిలో ఉన్నాయి



ఎన్టీఆర్ అభిమానులకు డబుల్ ధమాకా!

ఒకేసారి రెండు సినిమాలతో తారక్ సందడి.. ప్రశాంత్ నీల్, త్రివిక్రమ్, అనిల్ రావిపూడితో భారీ ప్రాజెక్టులు

హైదరాబాద్: మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ అభిమానులకు వరుస శుభవార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం వరుస భారీ చిత్రాలతో బిజీగా ఉన్న తారక్ మరో క్రేజీ ప్రాజెక్టుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'డ్రాగన్' సినిమాతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పిన ఆయన, ఆ తర్వాత మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్‌తో మరో ప్రతిష్ఠాత్మక చిత్రంలో నటించనున్నారు. ఇదే సమయంలో దర్శకుడు అనిల్ రావిపూడితోనూ కొత్త సినిమా ప్రకటించడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపైంది.

ప్రశాంత్ నీల్‌తో 'డ్రాగన్'

ప్రస్తుతం ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో 'డ్రాగన్' చిత్రం రూపొందుతోంది. భారీ యాక్షన్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే అంచనాలు పెరిగాయి. ప్రశాంత్ నీల్ తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. షూటింగ్ పూర్తయిన తర్వాత ఈ చిత్రం విడుదలకు సిద్ధం కానుంది.

త్రివిక్రమ్‌తో 'గాడ్ ఆఫ్ వార్'

'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో నటించనున్నారు. ఈ సినిమాకు 'గాడ్ ఆఫ్ వార్' అనే పేరు ప్రచారంలో ఉంది. జూలై నుంచి ఈ ప్రాజెక్టును సెట్స్‌పైకి తీసుకెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారీ కథా నేపథ్యంతో రూపొందనున్న ఈ చిత్రంపై అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తి నెలకొంది. అయితే సినిమా షూటింగ్ తేదీలు, ఇతర నటీనటుల వివరాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


అనిల్ రావిపూడితో మరో సినిమా

మరోవైపు ఎన్టీఆర్, అనిల్ రావిపూడి కలయికలో సినిమా ఉంటుందని అధికారికంగా ప్రకటించడం అభిమానులకు మరో కానుకగా మారింది. ఈ చిత్రాన్ని నందమూరి కల్యాణ్ రామ్ తన ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నిర్మించనున్నారు. ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే సినీ పరిశ్రమలో ఆసక్తికర చర్చ సాగుతోంది. మాస్, కామెడీ, కుటుంబ వినోద చిత్రాలతో విజయాలు అందుకున్న అనిల్ రావిపూడి.. ఎన్టీఆర్‌ను ఏ తరహా పాత్రలో చూపించబోతున్నారన్నది ఆసక్తికరంగా మారింది.

రెండు సినిమాలు ఒకేసారి చేస్తారా?

త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందనున్న భారీ చిత్రానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈ మధ్యలో అనిల్ రావిపూడితో ఓ వేగవంతమైన ప్రాజెక్టును పూర్తి చేయాలనే ఆలోచన ఉందని ప్రచారం జరుగుతోంది.

గ్రామీ నామినేషన్లలో 'ధురంధర్'కు నిరాశ!



రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై యాక్షన్ థ్రిల్లర్ ధురంధర్: ది రివెంజ్ చిత్రానికి 2027 గ్రామీ అవార్డుల్లో నిరాశ ఎదురైంది. ఈ సినిమా నుంచి సంగీత దర్శకుడు శాశ్వత్ సచ్‌దేవ్ రూపొందించిన పాటలను ఎనిమిది విభాగాల్లో పరిశీలనకు పంపినప్పటికీ, తుది నామినేషన్లలో ఒక్కదానికి కూడా చోటు దక్కలేదు. 'ఫిర్ సే', 'జైయే సజనా', 'జాన్ సే గుజర్తే హై', 'కన్హయ్యా', 'ఆరి ఆరి', 'మన్ అట్కేయా' వంటి పాటలు వివిధ విభాగాల్లో పోటీపడ్డాయి. దేశంలో మంచి ఆదరణ పొందిన ఈ పాటలకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందని చిత్ర బృందం ఆశించినా ఫలితం దక్కలేదు. అయితే, భారతీయ సంగీతానికి గ్రామీ వేదికపై ప్రాతినిధ్యం లభించింది. దేవన్ ఏకాంబరం, సుషా ఆలపించిన తమిళ గీతం 'వరువాయ్' బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ విభాగంలో నామినేషన్ సాధించింది. గ్రామీ చరిత్రలో ఓ తమిళ పాటకు నామినేషన్ దక్కడం ఇదే తొలిసారి. 2027 గ్రామీ నామినేషన్లలో బ్రిటిష్ గాయని రే 11 నామినేషన్లతో ముందుండగా, బియాన్స్ తన కెరీర్‌లో 100 గ్రామీ నామినేషన్లు పొందిన తొలి కళాకారిణిగా చరిత్ర సృష్టించింది.